క్లుప్తంగా

మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా ప్రసాదరావు


బలగ ప్రసాదరావు

వంగర: యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా బలగ ప్రసాదరావు ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. స్థానిక ప్రాథమిక పాఠశా లలో యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో సభ్యులంతా ప్రసాదరావును మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. యూటీఎఫ్ నాయకులు పల్ల మురళీ, పెంకి గౌరీశంకర రావు, కాంబోతుల రమణ పాల్గొన్నారు.

పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు


కొప్పర గ్రామ సమీపంలో పంటపొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

వంగర: మండలంలోని కె.కొత్తవలస, కొప్పర గ్రామాల సమీపంలో శనివారం ఏనుగుల గుంపు సంచరిం చింది.వరి వెదపంటతో పాటు వరి నారు మడులను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.ఏనుగులు సంచరిస్తున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అట వీ, రెవెన్యూ శాఖల సిబ్బంది ముందుగానే ప్రచారం చేయడంతో చాలా వరకు ఆయా గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.పొలాలకు వెళ్లిన కొంతమంది రైతులు ఏనుగులను చూసి భయాందోళనతో ఇళ్లకు పరుగులు పెట్టారు.

అనాథ బాలికలకు సైకిళ్ల పంపిణీ రేపు

బాడంగి: వి.కె.యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్, క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సంయుక్తంగా జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న అనాథ బాలికలకు స్థానిక హైస్కూల్ వేదికగా ఈనెల 7వ తేదీన సైకిళ్ల పంపిణీ చేయనున్నారని స్థానిక హైస్కూల్ హెచ్ఎం డి. సత్యనారాయణ, ప్రత్యే క ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న తల్లిదం డ్రులు లేని 150 మంది బాలికలకు రూ.8లక్షల విలువైన సైకిళ్ల పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలి

బొబ్బిలిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఎంఈఓ లక్ష్మణరావును కోరారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 9వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో తాము కూడా పాల్గొంటామని ఎంఈఓకు స్థానిక ఎమ్మార్సీలో శనివారం నోటీసు అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు పి.శంకరరావు మాట్లాడుతూ ఎండీఎం నిర్వాహకుకు బీమా సౌకర్యం కల్పించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు.వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు.

రోటరీ సేవలు మరింత విస్తృతం


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు

బొబ్బిలి: పట్టణ రోటరీ క్లబ్ సభ్యులంతా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు అన్నారు. స్థానిక రోటరీ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు వారణాసి శ్రీహరి అధ్యక్షతన శనివారం క్లబ్ అసెంబ్లీ సమావేశం నిర్వహించారు.అతిథిగా హాజరైన జె.సి.రాజు మాట్లాడుతూ రోటరీక్లబ్ తరఫున పేద కుటుంబాలను గుర్తించి వారి జీవనస్థాయి పెంపొందించే విధంగా చర్యలుండాలన్నారు. వారికి నిత్యావసరాలు సమకూర్చుతూ వారి అవసరాలను తెలుసుకుని తీర్చాలన్నారు. మాజీ అధ్యక్షుడు సింద్రీ శ్రీనివాసన్ మాట్లాడుతూ గతేడాది బొబ్బిలి పరిధిలో రూ.11.22 లక్షలతో 38 సామాజిక ప్రాజెక్టులను, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడు తూ బొబ్బిలి క్లబ్ పరిధిలో యునైట్ ఫర్ గుడ్ అనే కార్యక్రమం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిద్దామన్నారు. ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి శివకాంత్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

రాజాం: పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు.మండలంలోని వి.ఆర్.అగ్రహారం, అంతకాపల్లి తదితర గ్రామాల్లో చెత్త సేకరణను శనివారం పరిశీలించారు. క్లాప్ మిత్రలు క్రమం తప్పకుండా ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని చెప్పారు. మహిళలు తమ ఇంటితో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరుబయట చెత్త పారబోయవద్దని సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వేరుశనగ సాగుకు సెలవు..!

- బొబ్బిలి నియోజకవర్గంలో గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు
- పెట్టుబడి పెరగడం, దిగుబడులు తగ్గడమే కారణమంటున్న రైతులు
- కూరగాయలు, ఇతర పంటల సాగుపై ఆసక్తి
- బొబ్బిలి నియోజకవర్గంలో ప్రస్తుతం మెట్ట భూముల్లో సాగులో ఉన్న పంటల వివరాలు (హెక్టార్లలో)..

మండలం	పత్తి	మొక్కజొన్న	వేరుశనగ	కూరగాయలు
రామభద్రపురం	880	1306	01	121.45
బొబ్బిలి	180	318	01	09
బాడంగి	198	172	1.5	12.14
తెర్లాం	146	1,150	04	20.24


ఎస్.చింతలవలసలో కూరగాయల పంటలు సాగు చేసేందుకు దుక్కుచేస్తున్న రైతు


నాయుడువలసలో సాగులో ఉన్న మొక్కజొన్న


రామభద్రపురం సాగులో ఉన్న పత్తి పంట

రామభద్రపురం: ఒకప్పుడు వేరుశనగ సాగులో అగ్రస్థానంలో ఉన్న బొబ్బిలి వ్యవసాయ డివిజన్‌లో ఈ పంటకు ప్రస్తుతం రైతులు సెలవు ప్రకటిస్తున్నారు. బొబ్బిలి వ్యవసాయ డివిజన్‌లో వేరు శనగ సాగు గణనీయంగా తగ్గింది.ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో పాటు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువవడంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపడం లేదు. గతంలో ప్రభుత్వం రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేది. ప్రస్తుతం ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరు శనగ కాయల్లో ఎక్కువ శాతం నాసిరకంగా ఉంటుండంతో మొలక శాతం తగ్గుతోంది. మొలకవచ్చినప్పటికీ తగిన స్థాయిలో దిగుబడి ఉండడం లేదు. వేరుశనగ విత్తనాల కోసం రైతుసేవా కేంద్రాలకు రైతులు వస్తారేమోనని సిబ్బంది ఎదురు చూస్తున్నప్పటికీ రైతులు ఎవరూ అటువైపు వెళ్లడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఎక్కడో కొద్దో గొప్పో సాగు చేసే వారు ప్రైవేటు దుకాణాల్లో కొను గోలు చేసి తెచ్చుకుంటున్నారు. వేరుశనగ పంట స్థానంలో పత్తి,మొక్కజొన్న,కూరగాయల పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అందని పెట్టుబడి సాయం..ఎరువు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగు పెట్టుబడి సాయం అందించకుండా మీనమేశాలు లెక్కిస్తోంది. తాము అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ఇచ్చే పెట్టుబడి సాయంతో సంబంధం లేకుండా ప్రతీ రైతుకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంకా రైతులకు ఒక్క రూపాయి కూడా పెట్టుబడి సాయం అందించలేదు. ఒక ఏడాది ఎగనామం పెట్టేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం అందలేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఇంకా ఎరువులు కూడా పంపిణీ చేయలేదు. రైతు సేవా కేంద్రాల్లో కొద్దో గొప్పో డీఏపీ అందుబాటులో ఉన్నప్పటికీ యాప్ పనిచేయకపోవడంతో నేటికీ ఒక్క రైతుకు పంపిణీ చేయలేదు. రైతులు ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించి ఎరువు బస్తాకు రూ.50 వరకు అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

పెట్టుబడి రావడం లేదు



ఒకప్పుడు ఎక్కువగా వేరుశనగ పంటనే సాగు చేసేవాళ్లం. ఇప్పుడు ఈ పంట సాగు వల్ల నష్టాలే తప్ప పెట్టుబడి కూడా రావడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఆశించిన మేర దిగుబడులు రావడం లేదు.ప్రభుత్వం కూడా సకాలంలో విత్తనాలు,ఎరువులు సరఫరా చేయడం లేదు. కూరగాయలు,పత్తి,మొక్కజొన్న వంటి ఇతర పంటలు సాగుచేసుకుంటున్నాం.

– పూడి వెంకటరావు, రామభద్రపురం

తక్కువ దిగుబడులే కారణం



గతంలో బొబ్బిలి నియోజకవర్గంలో రైతులు వేరు శనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలోనే సాగు చేసేవారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు కారణంగా ఈ పంట సాగుకు పెట్టుబడి ఎక్కువై తక్కువ దిగుబడి వస్తోంది. దీంతో పంట సాగు గణనీయంగా తగ్గుతోంది.అలాగే ఆయిల్ మిల్స్ కూడా అందుబాటులో లేకపోవడం,రైతులు పత్తి,మొక్కజొన్న పంటలపై ఆసక్తి చూపుతున్నారు.ఆ పంటల వల్ల అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

– శ్యామ్‌ప్రసాద్,వ్యవసాయశాఖ ఏడీ,బొబ్బిలి

విద్యావ్యవస్థ కుంటుపడుతోంది


మాట్లాడుతున్న విజయగౌరి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న విద్యా విధానాలు ఇంతకు మునుపెన్నడూ లేని విధంగా ఉన్నాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. పట్టణంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలల విలీనాలు, టీచర్ల కుదింపు వంటి చర్యలతో పాఠశాలల్లో సరిపడా టీచర్లు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతోందన్నారు. మరో పక్క సమాంతర మీడియం రద్దు చేసి యాప్‌ల భారం మోపుతున్న ప్రభుత్వం విట్‌నెస్ ఆఫీసర్లు, డాక్యుమెంటేషన్లతో కొత్త పద్ధతులు తీసుకువస్తోందన్నారు. అసలు ఈవిట్‌నెస్ ఆఫీసర్లు, డాక్యుమెంటేషన్‌లు ఎందుకు..? కొత్తగా మళ్లీ ప్రపంచ బ్యాంకు అప్పు కోసమా అని నిలదీశారు. రాష్ట్ర విద్యాశాఖ చర్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. టీచర్లను స్కూళ్లలో లేకుండా చేసి మిగులు టీచర్ల సాకుతో క్లస్టర్ విధానాన్ని తీసుకువచ్చి క్లస్టర్ కాంప్లెక్స్‌లను నియమించారన్నారు. మళ్లీ ఇప్పుడు మెగా పేరెంట్స్ మీటింగ్‌లో వాళ్ల ఇచ్చిన ఎజెండా అంతా జరిపినట్టు విట్‌నెస్ అధికారిని నియమించాలని ఆదేశాలిచ్చారన్నారు. ముందు ఈ విట్‌నెస్ అధికారి నియామక ఉత్తర్వులను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలు తప్పవన్నారు. మొత్తం 17రకాల కమిటీలు వేయాలని, అన్ని కార్యక్రమాలకూ సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, దానికోసం డాక్యుమెంట్ కమిటీలుగా మార్చడం ఎంతవరకు సబబన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం


రాజాం సిటీ: మాట్లాడుతున్న రాజాం సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ


బొబ్బిలి: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జిలు రాజేష్‌కుమార్, హేమస్రవంతి జానకీరాం

రాజాం సిటీ : లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, రాజాం సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. స్థానిక న్యాయస్థానాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసి 136 కేసులను పరిష్కరించామని చెప్పారు. వీటిలో 10 సివిల్ కేసులు, భార్యభర్తల వివాదాల కేసులు 2, క్రిమినల్ కేసులు 110, మూడు చెక్ బౌన్స్ కేసులు, 7 ఎక్సైజ్ కేసులు, 4 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నట్టు వెల్లడించారు. చట్టరీత్యా రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని చెప్పారు.లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పే అంతిమ తీర్పు అని వివరించారు. సివిల్ కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇస్తామని వివరిచారు. రాజాం జూనియర్ డివిజన్ కోర్టు సివిల్ జడ్జి కె.నైమిష, బార్ అసోసియేషన్ సెక్రటరీ బి.తిరుపతి నాయుడు, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్, ఏపీపీ నరేష్, సీనియర్ న్యాయవాది రెడ్డి రామమూర్తి, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.రమణమూర్తి, లోక్ అదాలత్ న్యాయవాద సభ్యులు బి.రమణమూర్తి, బి.వి. కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

69 కేసుల పరిష్కారం

బొబ్బిలి: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 61 కేసులు పరిష్కారమ య్యాయని విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి.వి.రాజేష్‌కుమార్ తెలిపారు. కోర్టులో జాతీయ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం కోసం రెండు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఒక బెంచ్‌లో అదనపు సీనియర్ సివిల్ జడ్జి రెండో బెంచ్‌లో బొబ్బిలి జూనియర్ సివిల్‌జడ్జి హేమ స్రవంతి జానకీరాం ఉన్నారు. వీరికి సీహెచ్.ఎల్.వి.ప్రసన్న కుమార్, ఆర్.వి.బి.ఎల్.ప్రసాద రావు న్యాయవాదులుగా వ్యవహరించారు. సివిల్‌లో ప్రోనోటు, టైటిల్ కేసులు, చెక్ బౌన్స్, క్రిమినల్ జేపీసీ, క్రిమినల్ ఎక్సైజ్ కేసులు, ప్రీలిటిగేషన్ తదితర 61 కేసులను రాజీ కుదిర్చి పరిష్కరించామని న్యాయమూర్తి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆనంద్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌లో అభ్యంతరాలుంటే తెలియజేయండి


మాస్టర్ ప్లాన్ డ్రాఫ్టును నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, డీఈఈ కిరణ్‌కుమార్

బొబ్బిలి: అర్బన్ డవలప్‌మెంట్ అథారటీ- 2016 యాక్ట్ ప్రకారం పట్టణ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్టును ప్రచురించామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. దీని ప్రతిని మున్సిపల్ కార్యాలయం నోటీసుబోర్డులో శనివారం ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లా డుతూ మున్సిపల్ పరిధిలో ఉన్న స్థానికులు, పట్టణ పరిధిలో వివిధ ఆస్తులు కలిగి ఉన్న వ్యక్తులు ఈ డ్రాఫ్ట్ కాపీని పరిశీలించాలన్నారు. అభ్యంతరాలు, సూచనలను మున్సిపల్ కార్యాలయంలో వచ్చే నెల 4వ తేదీలోగా లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. డీఈఈ కిరణ్‌కుమార్, తదితరులున్నారు.

ఏనుగుల తరలింపులో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తదితరులు

వంగర: మండలంలో పంటలను ధ్వంసం చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల గుంపును తరలించడంలో అధికార యంత్రాంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో రెండు వారాలుగా తొమ్మిది ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త మరువాడ సమీపంలో జూన్ నెలలో ప్రవేశించిన ఏనుగుల గుంపు కింజంగి, శ్రీహరిపురం, నీలయ్యవలస, జగన్నాథవలస, మద్దువలస, సంగాం, ఓనె అగ్రహారం, వంగర, మగ్గూరు, ఎం.సీతారాంపురం, శివ్వాం, తలగాం, కొప్పవలస, కె.కొత్తవలస, కొప్పర గ్రామాల్లో పంటలను ధ్వంసం చేశాయని చెప్పారు. అధికార యంత్రాంగం కనీసం పట్టించుకోవడం లేదని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఇదే మాదిరిగా ఏనుగుల గుంపు మండలంలో ప్రవేశించగా అప్పట్లో మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ, ఎంపీగా ఉన్న బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఏనుగుల తరలింపు చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కుంకీ ఏనుగును తెప్పించి ఏనుగులను తరలించే చర్యలు చేపడతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారే కానీ ఆచరణలో పెట్ట లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ, అధికార యంత్రాంగం స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు చేపట్టాలని, నష్ట పోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాబోతుల శ్రీనివాసునాయుడు, బొక్కేల వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తాం

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

రామభద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు ఇతర హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తెలిపారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలన్నీ కొనసాగిస్తామని, వాటితో పాటు సూపర్ సిక్స్, ఇతర పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ఎన్నికల్లో చంద్ర బాబు వాగ్దానం చేశారన్నారు. పథకాల అమలకు బాబు ష్యూరిటీ అని చెప్పి గ్యారెంటీ ఇస్తున్నామంటూ టీడీపీ, జనసేన కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సంతకం చేసిన బాండ్లను ప్రజలకు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్‌పథకాలు, ఇతర ఏ పథకా లు అమలు కాలేదన్నారు. పథకాలు అమలు చేయకపోయినప్పటికీ ఎవరైనా సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రశ్నిస్తే వారికి నాలుక మందమేనని ముఖ్యమం త్రి చంద్రబాబు అంటున్నారని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఊరూరా ప్రచా రం చేశారని, ఈ పథకాన్ని ఒక ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతు న్నారని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టిస్తుంటే డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబుకు అద్దెకు ఇవ్వడానికే పవన్ పార్టీ పెట్టారని ఆరోపించారు. జగన్‌ను అధికారంలోకి రానివ్వను అని పవన్ అంటున్నారని, జగన్‌ను అధికారంలోకి రానివ్వకపోవడానికి ఆయన ఎవరని ప్రశ్నించారు.ఎవరు అధికారంలోకి రావాలో నిర్ణయించేది ప్రజలన్న సంగతి పవన్ గుర్తెర గాలన్నారు. ప్రజాసంక్షేమంపై చంద్ర బాబుకు, పవన్‌బాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చొక్కాపు రామకృష్ణ, కిర్ల చంద్రశేఖర్, దండి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

20న పీఆర్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

బాడంగి: బాడంగి యూనిట్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్టు ఆసంఘ అధ్యక్షుడు, పీఐయూ కార్యాలయ జేఏ వై.శ్యామలరావు తెలిపారు. స్థానిక పీఐయూ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.జిల్లా కమిటీ అధ్యక్షులు సీహెచ్. మురళి, ఏ.సురేష్, వి.రాంబాబు పర్యవేక్షణలో స్థానిక కార్యాలయంలో నిర్వహించనున్న ఎన్నికలకు బాడంగి, తెర్లాం మండలాల పీఆర్ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు. అదే రోజు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ఉంటుందని, అనంతరం ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారులుగా లక్ష్మణకుమార్ , రామకుమార్ వ్యవహరిస్తారని చెప్పారు.

ఫ్లోరైడ్ బాధితులను గుర్తించాలి


మాట్లాడుతున్న జిల్లా ఫ్లోరైడ్ నివారణ అధికారి అరుణజ్యోతి

రాజాం సిటీ: ఫ్లోరైడ్ బాధితులను గుర్తించేందుకు ఇంటింట సర్వే చేపట్టాలని జిల్లా ఫ్లోరైడ్ నివారణ అధికారి అరుణజ్యోతి అన్నారు. స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీలో బొద్దాం, పొగిరి, బూరాడ, వంగర, రేగిడి, సంత కవిటి, మండాకురిటి, పెరుమాళి, వాడాడ, తెర్లాం పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్లోరైడ్ నివారణకోసం ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యారోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటా సర్వే చేసి ఫ్లోరైడ్ బాధితులను గుర్తిం చాలని చెప్పారు.అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగు నీటిలో ఫ్లోరైడ్ శాతాన్ని పరీక్షించాలని, అధిక శాతం ఫ్లోరైడ్ ఉంటే తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. బ్లాక్ సాల్ట్ అధికంగా ఉండే చిప్స్, పానీపూరి, జంక్ ఫుడ్స్ అధికంగా తీసుకోవడం వల్ల ఫ్లోరైడ్ బారినపడే అవకాశం ఉందని, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ ఛాంపియన్‌కు సత్కారం

బొబ్బిలి: పట్టణంలోని అగురువీధికి చెందిన బొండపల్లి రమేష్ గత వారం ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో రెండు పతకాలు సాధించాడు. ఈయన్ని ఎమ్మెల్యే బేబీ నాయన పట్టణంలో శనివారం సత్కరించారు.కౌన్సిలర్లు వెలగాడ హైమావతి,గెంబలి శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్, స్థానికులు అభినందించారు.

సంక్షిప్తంగా...

సత్ప్రవర్తనతో మెలగాలి

బొబ్బిలి: నేర స్వభావాన్ని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని నేర ప్రవృత్తి,నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు డీఎస్పీ జి.భవ్యారెడ్డి సూచించారు. శనివారం స్థానికపోలీసుస్టేషన్‌లో బొబ్బిలి, బాడంగి, తెర్లాం ,రామభద్రపురం మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని నేర ప్రవృత్తి,నేరచరిత్ర కలిగిన వ్యక్తులతో ఆమె మాట్లాడారు. గతంలో వారు చేసిననేరాలు, వాటి పర్యవసానం గురించి విడమర్చారు. అటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలని హెచ్చరించారు.లేకుంటే కఠినచర్యలు తప్పవన్నారు. నేర స్వభావం కలిగిన వారి కదలికలపై కన్నేసి ఉంచాలని బొబ్బిలి, బాడంగి, తెర్లాం,రామభద్రపురం ఎస్‌ఐలకు సూచించారు. సీఐలు కె. సతీష్‌కుమార్,నారాయణరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గ్రోత్ సెంటర్‌లో ఉన్న రెండు సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ ఇన్‌చార్జ్ ఎం శ్రీనివాసరావు శనివారంఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణంలోని మల్లంపేట, రాజమహల్ ఏరియా,ఐటీఐ కాలనీ, ఇందిరమ్మకాలనీకి విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల కౌంటర్ తెరవాలి

బొబ్బిలి: పట్టణంలోని కోవెల సెంటర్‌లో 15 రోజులుగా మూతబడిన విద్యుత్ బిల్లుల చెల్లింపుల కౌంటర్‌ను తెరవాలని ఉత్తరాంధ్ర సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. మూతబడిన కౌంటర్‌వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న వినియోగదారులంతా ఈ కౌంటర్ వద్ద విద్యుత్ బిల్లులు చెల్లించేవారన్నారు. ఈ కౌంటర్ చాలదని, మరోకౌంటర్ ఏర్పాటుచేస్తారని వినియోగదారులు అనుకుంటుంటే ఉన్న ఒక్క కౌంటర్‌ను కూడా మూసివేయడం దారుణమన్నారు. ఇప్పుడు ఈ బిల్లుల కలెక్షన్‌పాయింట్‌ను ఎందుకు తెరవడం లేదో అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. వెంటనే కలెక్షన్ పాయింట్‌ను తెరచి పత్రికా ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో కౌంటర్‌ను గొల్లపల్లి వద్ద ఏర్పాటు చేయాలని కోరారు. జగదీష్,అప్పారావు, శంకరరావు, సూరిబాబు, ఆదినారాయణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.


పన్నులు విధించండి

బొబ్బిలి: పట్టణంలో పన్నులు వేయాల్సిన అసెస్మెంట్‌లను గుర్తించి వెంటనే పన్నులు విధించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వార్డు సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల వారీగా డిమాండ్ నోటీసులను పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఓ నాగరాజు,ఆర్ఐ పి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రేగిడి: మండలంలోని వండానపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు శనివారం సందర్శించారు. విద్యార్థుల హాజరు రికార్డులు, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో బడి బయట ఉన్న బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే విధంగా చూడాలని హెచ్ఎంయాగాటి గణపతికి చెప్పారు. ఎంఈఓ వెంట పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసరి కృష్ణారావు పాల్గొన్నారు.

గౌరవ వేతనం కోసం నిరసన


నిరసన తెలుపుతున్న స్వచ్ఛ దూత్‌లు, ఎండీఎం నిర్వాహకులు, కార్మిక సంఘాల నాయకులు

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు (స్వచ్ఛదూత్) నెలకు రూ.10 వేలు, మద్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులకు వేతనం కనీస గౌరవ వేతనం ఇవ్వాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక రాజాం మండల అధ్యక్ష,కార్య దర్శు లు పార్వతి, సునీత డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద పారి శుద్ధ్య కార్మికులు, మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులతో కలిసి శనివారం నిరసన తెలిపారు.ఉద్యోగ భద్రత, ఆరోగ్యబీమా వంటి సదుపాయాలు కల్పించాలని, పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫారం దుస్తులు, శానిటరీ వస్తుసామగ్రి అందించాలని కోరారు. డిమాండ్ల పరిష్కారం నిమిత్తం కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను కార్మిక సంఘాలు, సభ్యులు జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ వి. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘాల నాయకులు అనూరాధ, లక్ష్మి, కృష్ణవేణి, హైమావతి, రమణమ్మ పాల్గొన్నారు.